సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 24 సెప్టెంబర్ । 2024



రాజన్నా... శరణు శరణు

వేములవాడ: రాజన్నను సోమవారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, కోడెమొక్కులు చెల్లించారు.



అభివృద్ధికి ప్రతిపాదనలు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పర్యాటక శాఖ ఏఈ జీవన్ రెడ్డి సోమవారం సందర్శించారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తీసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీనియర్లకు అన్యాయం



సిరిసిల్లటౌన్: పార్టీలో కొత్తగా చేరిన వారికే నామినేటెడ్ పోస్టులు ఇచ్చారని, సీనియర్లను విస్మరించారని పలువురు కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి తీరును తప్పుబట్టారు. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పదవులు ఎలా కట్టబెట్టారని నర్మాలకు చెందిన నిమ్మల తిరుపతిగౌడ్ ప్రశ్నించారు. సీనియర్ నాయకులకు మొండిచేయి చూపడం ఏంటని ఓరగంటి నర్సింలు, పెద్దిగారి శ్రీనివాస్ అడిగారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరిస్తామన్నారు. చీకోటి నర్సయ్య, బాలయ్య, సత్యం, నర్సింలు, బాలకిషన్ పాల్గొన్నారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

వేములవాడ: ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 74 మందికి ట్రాఫిక్ ఎస్సై రమేశ్, ఆర్‌ఎస్సై రాజు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణ ఠాణాకు పిలిపించి మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలు, నష్టాల గురించి వివరించారు. ప్రమాదంలో ప్రాణాలు కుటుంబాలు రోడ్డున పడతాయని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి జ్యోతిర్మయి జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఇద్దరికి రూ.3500 చొప్పున, 20 మందికి రూ.2500 చొప్పున, 51 మందికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం మండల పరిషత్ ఎదుట ధర్నా చేపట్టారు. పది రోజులుగా నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేత



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో డీలక్స్ బస్సుల్లో సికింద్రాబాద్‌కు ప్రయాణించిన మహిళలకు నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలకు సోమవారం బహుమతులు అందించారు. మొదటి బహుమతి ఇందిర, రెండో బహుమతి విజయలక్ష్మి, మూడో బహుమతి శ్రీలతకు అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా లీగల్ మెట్రాలజీ రూపేశ్‌కుమార్, డిపో మేనేజర్ శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

యోగా శిక్షకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సిరిసిల్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో 842 యోగా శిక్షకుల పోస్టులను పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేసేందుకు ఆయుష్ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 842 పోస్టుల్లో 421 పోస్టులు పురుషులకు, మరో 421 మహిళా అభ్యర్థులకు కేటాయించారు. సెషన్ల వారీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని, ప్రతీ సెషన్ గంటసేపు ఉంటుందని, ఒక్కో సెషన్‌కు రూ.250 చొప్పున రెమ్యునరేషన్ చెల్లించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని రాంనగర్ ఆయుష్ ఆయుర్వేదిక్ కేంద్రంలో ఈనెల 28న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

ప్రలోభాలకు లోను కావద్దు

సిరిసిల్లకల్చరల్: ఆకర్షణ వలలో పడడం, ప్రలోభాలకు లొంగకుండా ఉండడం అవసరమని జిల్లా షీటీమ్ ఏఎస్సై ప్రమీల పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం పోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై ప్రమీల మాట్లాడుతూ ఆడపిల్లలను వేధింపులకు గురిచేస్తే టోల్ ఫ్రీ నంబర్ 87126 56425లో సంప్రదించాలని సూచించారు. బాల రక్షా భవన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు శ్రీనివాసరావు, వెంకటేశం, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాధికారి సామల వివేకానంద, కనకయ్య, చంద్రమౌళి, తిరుపతి, రాజయ్య, శశిధర్ ఉన్నారు.



సిరిసిల్ల టౌన్ క్లబ్ వద్ద ఎండలోనే టిఫిన్ చేస్తున్న క్రీడాకారులు



టెంట్ లేక ఎండలోనే సేదతీరుతున్న క్రీడాకారిణులు

వసతులు లేక ఆరుబయటే..

సిరిసిల్లటౌన్: క్రీడాపోటీల నిర్వాహకుల నిర్వాకంతో క్రీడాకారులు ఇబ్బందులు పడ్డారు. పోటీల్లో పాల్గొనడానికి, భోజనాలు చేయడానికి కిలోమీటర్ల దూరం నడవడం విమర్శలకు దారితీసింది. సిరిసిల్లలో రెండు రోజులు జరిగిన సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు 20 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారు. అయితే క్రీడామైదానం వద్ద క్రీడాకారులు కనీసం కూర్చునేందుకు టెంట్ ఏర్పాటు చేయలేదు. టిఫిన్‌లు సైతం ఎండలోనే కానిచ్చారు. బాలికలకు బతుకమ్మ ఘాట్ వద్ద, బాలురకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు బస తెలంగాణభవన్, ప్రైవేటు ఫంక్షన్‌హాల్, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. టిఫిన్స్, భోజనం చేసేందుకు ఉన్న వసతిగృహాల నుంచి కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి వెళ్లాల్సిన దుస్థితి.



మానేరుతీరంలో శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కదిలిన కార్మికులు.. మానేరు పరిశుభ్రం

సిరిసిల్లటౌన్: స్వచ్ఛత హీ సేవాలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ సిబ్బంది సోమవారం మానేరుతీరంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ నేతృత్వంలో సిబ్బంది గంటల తరబడి శ్రమించి పరిసరాలను శుభ్రం చేశారు. అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘స్వశక్తి’ చీరలపై కసరత్తు

- మహిళలకు ఏటా రెండు చీరలు ఇస్తామన్న ప్రభుత్వం
- సిరిసిల్లలోని సాంచాల ముందస్తు సర్వేలు
- నూలు, డిజైన్లు, రేట్లపై సమాలోచనలు



సిరిసిల్ల పవర్‌లూమ్ కార్ఖానాల్లో జౌళిశాఖ సర్వేలు

సిరిసిల్ల: రాష్ట్రంలోని స్వశక్తి పొదుపుసంఘాల్లోని మహిళలకు చీరలు పంపిణీ చేయడం.. నేతన్నలకు ఉపాధి కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వం అందించిన బతుకమ్మచీరల స్థానంలో నాణ్యత, నవ్యత గల చీరలను అందించాలని ప్రణాళికతో అధికారులు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పొదుపు సంఘాల్లోని మహిళలకు ఏటా రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ చీరలను చేనేత మగ్గాలపై ఉత్పత్తి చేయాలని భావించినప్పటికీ అంత పెద్దమొత్తంలో చేనేత మగ్గాలపై సాధ్యం కాదని సిరిసిల్లలోని మరమగ్గాలపై ఉత్పత్తిచేయాలని నిర్ణయానికొచ్చారు. ఈమేరకు అధికారులు సిరిసిల్లలోని పవర్‌లూమ్స్‌లో సర్వే చేస్తున్నారు. సిరిసిల్లలో 130 మ్యాక్స్ సంఘాలు, 127 చిన్న తరహా పరిశ్రమలు ఉండగా.. వీటి ప్రస్తుత సామర్థ్యం ఎంత. ఒక్కో కార్ఖానాలో ఎన్ని కరెంట్ మీటర్లు ఉన్నాయి, ఎన్ని సాంచాలు ఉన్నాయి.. అనే వివరాలు సేకరిస్తున్నారు.

నాణ్యత.. నవ్యత.. డిజైన్లపై దృష్టి

ఏడేళ్లుగా సిరిసిల్లలో నేతన్నలు ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులు నాణ్యత, నవ్యత, డిజైన్ల రూపకల్పన ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో బతుకమ్మ చీరలకు వాడిన నూలు, వాటి రంగులు నాసిరకంగా ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం స్వశక్తి పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అందించే చీరలు నాణ్యతతో ఉండాలని భావిస్తున్నారు. ఈ మేరకు సిరిసిల్లలో పలు డిజైన్లలో చీరలు ఉత్పత్తి చేసి తేవాలని జౌళిశాఖ అధికారులు సూచించారు. మరోవైపు కొత్త డిజైన్లను రూపొందించాలని దృష్టి సారించారు.

ఏటా 7.66 కోట్ల మీటర్ల ఆర్డర్లు

ప్రస్తుత లెక్కల ప్రకారం రాష్ట్రంలో 63.86 లక్షల మంది మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరందరికీ రెండేసి చీరలు ఇవ్వాలంటే 1,27,72,000 చీరలు అవసరం. ఈ చీరలు ఒకే సారి ఇవ్వాలా? పండుగల సందర్భంగా వేర్వేరుగా ఇవ్వాలనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఒక్కో చీర, జాకెట్‌తో కలిపి ఆరు మీటర్ల పొడవు ఉండగా.. ఏటా 7.66కోట్ల మీటర్ల వస్త్రాన్ని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. గతంలో సిరిసిల్లలో ఏటా 6.50కోట్ల మీటర్ల వస్త్రాన్ని సిరిసిల్ల నేతన్నలు ఉత్పత్తి చేశారు. ఇంత భారీ మొత్తంలో చీరల బట్ట ఉత్పత్తికి సిరిసిల్లలో నేతన్నలకు సామర్థ్యం ఉందా? చేనేత మగ్గాలపైనా కొంత మేరకు ఉత్పత్తి చేయాలా? అనే అంశాలను జౌళిశాఖ పరిశీలిస్తోంది.

ఏడేళ్లలో కేటాయింపులు ఇవీ

2017 నుంచి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తుండగా.. ఏటా బతుకమ్మ చీరల ఉత్పత్తికి ప్రభుత్వ కేటాయింపులు పెరిగాయి. 2017లో రూ.222.48కోట్లు కేటాయించగా.. 2018లో రూ.280కోట్లు ఇచ్చారు. 2019లో రూ.313.14కోట్లకు చేరింది. 2020లో రూ.317.81కోట్లు, 2021లో రూ.333.14కోట్లు, 2022లో రూ.339.73కోట్లు కేటాయించారు. చివరిసారిగా 2023లో రూ.351.52కోట్లకు పెంచారు. ఏటా నిధుల కేటాయింపులు పెరిగినా బతుకమ్మ చీరల్లో నాణ్యత లేదనే విమర్శలు వచ్చాయి.

కరెంట్ సమస్య పరిష్కారమయ్యేనా?

సిరిసిల్లలోని సాంచాలను కుటీర పరిశ్రమగా గుర్తిస్తూ 2001లో అప్పటి ప్రభుత్వం 50 శాతం విద్యుత్ రాయితీని కల్పించింది. సిరిసిల్లలో వస్త్రపరిశ్రమకు కేటగిరీ–4లో ప్రతీ యూనిట్ విద్యుత్‌కు రూ.4 విధిస్తూ.. ఇందులో సగం వస్త్రోత్పత్తిదారుడు రూ.2, మరో సగం రూ.2 ప్రభుత్వం భరిస్తుంది. ఈ రాయితీ 10 హెచ్‌పీల మోటార్ల వరకు(10 సాంచాలకే) వర్తిస్తుందని 2001లో జీవో జారీ చేశారు. ఫలితంగా సిరిసిల్లలో పది సాంచాలకు మించి కార్ఖానాలు ఏర్పాటు చేసి ఎక్కువ విద్యుత్ మీటర్లు పొంది వస్త్రోత్పత్తి చేస్తున్నారు. దీనిపై ఓ ఆసామి కోర్టును ఆశ్రయించడంతో 10 హెచ్‌పీల వరకే విద్యుత్ రాయితీ అందించాలని కోర్టు ఆదేశించింది. దీంతో సిరిసిల్లలోని కార్ఖానాల్లో ఎక్కువ సాంచాలు ఉన్న వారికి ప్రతీ యూనిట్‌కు రూ.7.80 విధిస్తూ బిల్లింగ్ చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించి సాంచాల సంఖ్యతో సంబంధం లేకుండా విద్యుత్ రాయితీ అమలు చేయాలని నేతన్నలు కోరుతున్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తే ప్రభుత్వం ఇచ్చే చీరల ఆర్డర్లతో నేతన్నల బతుకుదెరువుకు భరోసా లభిస్తుంది.

ముందస్తు ప్రణాళికతో సర్వే చేస్తున్నాం



సిరిసిల్లలో సాంచాల సంఖ్య, ఆ సాంచాలపై ఉత్పత్తి అవుతున్న వస్త్రాల వివరాలను ముందుస్తు ప్రణాళికలో భాగంగా సర్వే చేస్తున్నాం. ఇటీవల అమ్ముకున్న సాంచాలు ఎన్ని.. ప్రస్తుతం పనిచేసే కండీషన్‌లో ఉన్న సాంచాలు ఎన్ని అనే వివరాలు సేకరిస్తున్నాం. పూర్తి వివరాలు అందుబాటులో ఉంటే జౌళిశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందుకెళ్లేందుకు వీలుంటుంది.

– మిట్టకోల సాగర్, జౌళిశాఖ ఏడీ, సిరిసిల్ల

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్‌లోకి 200 మంది చేరిక

వేములవాడ: మైనార్టీల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయమని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రం ఆధ్వర్యంలో దాదాపు 200 మంది ముస్లింలు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. వేములవాడలో అసంపూర్తిగా ఉన్న షాదిఖానాను పూర్తి చేస్తామని, ఖబ్రస్థాన్ సమస్య పరిష్కరిస్తానన్నారు.

32 సంఘాలకు రూ.10కోట్లు

వేములవాడ నియోజకవర్గంలోని 32 సంఘాలకు రూ.10 కోట్లు కేటాయించినట్లు విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని మడలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మడలేశ్వర సంఘ భవనానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రజాప్రభుత్వంలో ఉద్యమకారులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేములవాడ ప్రాంతం వెనుకబడిందని, బ్రిడ్జి నిర్మాణానికి కనీసం భూమి కూడా సేకరించలేదన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మీ వల్లే బతికి బయటపడ్డా

- గల్ఫ్ బాధితుడు ఇమ్రాన్



ఆదికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఇమ్రాన్

పొట్టచేతబట్టుకుని సౌదీ వెళ్లిన తను అక్కడి పరిస్థితులతో అనారోగ్యంబారినపడ్డానని, తమవల్లే బతికిబయటపడ్డానని గల్ఫ్ బాధితుడు ఇమ్రాన్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిరిసిల్లకు చెందిన ఇమ్రాన్ రెండు నెలల క్రితం సౌదీలోని సూపర్‌మార్కెట్‌లో పని చేసేందుకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. తను పడుతున్న కష్టాన్ని సోషల్‌మీడియా ద్వారా తెలియజేశాడు. స్పందించిన విప్ వెంటనే ఇండియన్ ఎంబసీ ద్వారా సౌదీ అరేబియాకు లేఖ రాసి సంబంధిత అధికారులతో మాట్లాడగా.. ఈనెల 18న ఇమ్రాన్ సిరిసిల్లకు చేరుకున్నాడు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెంట్ల మాటలకు మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రజా‘వాణి’ వినండి

- కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చిన బాధితులు
- వివిధ సమస్యలపై 167 దరఖాస్తులు
- అధికారులు విధిగా హాజరుకావాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ

సిరిసిల్లఅర్బన్: క్షేత్రస్థాయిలో పరిష్కారం లభించక పలువురు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి బాట పడుతున్నారు. వివిధ సమస్యలపై దాదాపు 167 మంది తమ అర్జీలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూకు అందించారు. గత రెండు వారాలుగా ప్రజావాణి నిర్వహించకపోవడంతో సోమవారం భారీగా తరలివచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ప్రజావాణికి అధికారులు విధిగా హాజరుకావాల్సిందేనని స్పష్టం చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సౌకర్యాలు కల్పించండి



ఏడాదిగా డబుల్ బెడ్‌రూమ్‌లలో ఉంటున్నా కనీస సౌకర్యాలు లేవు. పిచ్చిచెట్లు పెరిగి, డ్రెయినేజీలు పేరుకుపోయి విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. అధికారులు స్పందించి మా కాలనీలో సౌకర్యాలు కల్పించాలి. – పెద్దూరు డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులు

పెన్షన్ ఇప్పించండి



మాది సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట. నాకు ఐదేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఒక కాలు, చేయి పడిపోయాయి. సార్లు నాయందు దయతలచి పింఛన్ ఇప్పించాలి.

– వొద్నాల ఎల్లయ్య, వెంకంపేట

నా ఆస్తిని మనుమడు కాజేశాడు



నాకు ఇద్దరు బిడ్డలు. నా భర్త చనిపోయిండు. నా చిన్నకూతురు కొడుకు నా పది ఎకరాలు అతని పేరిట రాయించుకున్నాడు. తర్వాత పట్టించుకోవడం లేదు. ఆ భూమి నాకు తిరిగి ఇప్పించాలి. – బద్ది బాలవ్వ, ఆవునూర్

కలెక్టర్ స్పందన.. దరిచేరిన వైద్యం



గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన బైరగోని విజయ్‌కుమార్ పక్షవాతంతో బాధపడుతూ కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చాడు. కలెక్టర్‌ను కలిసి తాను ఆర్థికంగా ఇబ్బందిలో ఉన్నానని, తనకు వచ్చిన పక్షవాతం వ్యాధికి వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నట్లు కన్నీటిపర్యంతమయ్యాడు. తనకు వైద్యసహాయం అందించాలని వేడుకున్నాడు. వెంటనే కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ స్పందించి.. అంబులెన్స్ పిలిపించి వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలింపజేశారు. హాస్పిటల్‌లో వైద్యసహాయం అందేలా ఆదేశాలు జారీ చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

దివ్యాంగులు సంకేత భాషపై పట్టు సాధించాలి

- మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌కృష్ణ
- సిరిసిల్లలో చెవుడు నివారణ, సంకేత భాషలపై అవగాహన



మాట్లాడుతున్న మోహన్‌కృష్ణ

సిరిసిల్ల: సంకేత భాషపై పట్టు సాధిస్తే వినికిడి లోపంతో ఉన్న విద్యార్థులు బాగా చదువుకునే అవకాశం ఉందని సిరిసిల్ల మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం చెవుడు నివారణ, నియంత్రణ, సంకేతభాషలపై అవగాహన కల్పించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ వినికిడి లోపాన్ని ముందుగా గుర్తిస్తే నివారించవచ్చన్నారు. చేతులు, ముఖ కదలికల ద్వారా అవగాహన కల్పించారు. కనుబొమ్మల సంకేతాలు చూపించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి సంపత్ కుమార్ పాఠశాల విద్యార్థులకు సంకేతభాషపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం భాగ్యరేఖ, సీహెచ్‌వో సత్యనారాయణ ఉన్నారు.

తప్పిదాలు సరిదిద్దుకోవాలి



సిరిసిల్లటౌన్: ఎస్సీ స్టడీ సర్కిల్‌తోపాటు వివిధ శాఖల్లో పోస్టుల భర్తీపై వస్తున్న విమర్శలపై అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల తరపున అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు కత్తెర దేవదాసు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ హయాంలో కేటీఆర్ సిరిసిల్లకు వస్తున్నారంటే ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేసేవారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో వివిధ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ పోస్టులు, రేషన్‌డీలర్లకు నోటిఫికేషన్లు ఇవ్వలేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. నాయకులు నేదూరి లక్ష్మణ్, గడ్డం కిరణ్, కొమ్ము రవి, బట్టు సురేందర్, వెంకటేశ్, త్యాగరాజు, రాజు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



సిరిసిల్ల: ప్రజావాణికి సమయపాలన పాటించాలని, ఆలస్యంగా వస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి గైర్హాజరయ్యారు. దీన్ని గుర్తించిన కలెక్టర్ ఆయనకు ఫోన్ చేయించి ప్రజావాణికి పిలిపించి, ఎందుకు రాలేదని ప్రశ్నించారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు తూము రిపేరుకు ప్రతిపాదనలు రూపొందించే పనిలో ఉన్నామని వివరణ ఇచ్చారు. మీ స్టాఫ్‌తో ఆ పనులు చేయించండి.. మీరు ప్రజావాణికి సమయానికి రావాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. మరోసారి ఇలాంటివి జరగనీయొద్దన్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులో ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. అగుళ్ల శ్రీనివాస్(45) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైరింజన్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం కోసం బావిలో గాలింపు చర్యలు చేపట్టారు.

మానేరు డ్యాంలో దూకిన వివాహిత

- లైఫ్ జాకెట్ విసిరి, రక్షించిన టూరిస్టులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని మానేరు డ్యాంలో ఓ వివాహిత దూకిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన వివాహిత ఆదివారం డ్యాం వద్దకు వెళ్లింది. టిక్కెట్ కొనుగోలు చేసి, టూరిస్ట్ బోటులో ఎక్కింది. మానేరు అందాలను వీక్షించేందుకు వెళ్తున్న మరో 17 మంది టూరిస్టులు అందులో ఉన్నారు. బోటు స్పీడ్ పెరగగానే సదరు వివాహిత వెనక్కి వెళ్లి, లైఫ్ జాకెట్ పక్కన పడేసి, నీటిలో దూకింది. దీంతో మిగతావారు షాక్‌కు గురయ్యారు. డ్రైవర్ బోటును ఆపగా, టూరిస్టులు కొందరు లైఫ్ జాకెట్ విసిరి, ఆమెను రక్షించారు. అనంతరం లేక్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని, బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎందుకు ఆత్మహత్యాయత్నం చేసిందన్న విషయం తెలియరాలేదు. దీనిపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లికి చెందిన రాచర్ల శంకర్(43), ఢీకొండ గ్రామానికి చెందిన గోపాల్ గత శనివారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఎండపల్లి వైపు వెళ్తున్నారు. ఎండపల్లి మండలంలోని చెర్లపల్లి వద్ద ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపాల్ కాలు విరగగా, శంకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శంకర్ సోమవారం మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

మెట్‌పల్లిరూరల్: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి మృతి చెందినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని మెట్లచిట్టాపూర్‌కు చెందిన బొమ్మ రవి(46) ఈ నెల 18న మెట్‌పల్లిలో పని ముగించుకొని, బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి, కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమైంది. కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు సోమవారం ఇంటికి తీసుకెళ్లగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- 10 నెలల క్రితమే భర్త ఆత్మహత్య
- అనాథలైన ఇద్దరు పిల్లలు
- మానకొండూర్‌లో ఘటన

మానకొండూర్: తల్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది.. తండ్రి 10 నెలల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు.. దీంతో ఐదేళ్ల, నాలుగేళ్ల వయసున్న ఆ దంపతుల పాప, బాబు అనాథలయ్యారు.. ఈ విషాద ఘటన మానకొండూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన కోంద్ర పవన్‌కల్యాణ్, ప్రహర్ష(24) 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక పాప, బాబు సంతానం. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్ 10 నెలల క్రితం ఇంట్లో ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రహర్ష కరీంనగర్‌లోని ఓ ట్రాక్టర్ షోరూంలో పని చేస్తోంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు పిల్లలను స్కూల్‌కు పంపించి వస్తానని మామ లక్ష్మణ్‌తో చెప్పి, వెళ్లింది. తిరిగి రాకపోవడంతో అతను చుట్టుపక్కల వెతికాడు. సమీప బావిలో ఆమె శవమై కనిపించింది. అయితే, ఉదయం ఓ వ్యక్తి స్కూటీపై వచ్చి, ప్రహర్షతో మాట్లాడి వెళ్లాడని మృతురాలి అత్త భాగ్య చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రహర్ష చనిపోవడానికి ఆ వ్యక్తే కారణమా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని మృతురాలి సోదరి నిర్మిట్ల ప్రసన్న అనుమానం వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, పసితనంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చూసి, వారి నానమ్మ, తాతయ్య కన్నీరుమున్నీరుగా విలపించారు. అది చూసి, స్థానికులు కంటతడి పెట్టారు.


భర్త, పిల్లలతో ప్రహర్ష (ఫైల్)

దాడి చేసి.. డబ్బులు, ఫోన్ లాక్కెళ్లి

- పోలీసులకు చిక్కిన ముగ్గురు నిందితులు
- 200 గ్రాముల గంజాయి, బైక్, 4 ఫోన్లు, రూ.5 వేలు స్వాధీనం


అరెస్టు చూపుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఓ వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఉప్లూర్‌కు చెందిన సుదగోని గంగాధర్‌గౌడ్ అనే డ్రైవర్ ఈ నెల 21న రాత్రి మక్కల లోడును ఆర్మూర్ వైపు నుంచి మెట్‌పల్లి వైపు తీసుకెళ్తున్నాడు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి మూత్ర విసర్జన చేస్తున్నాడు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అక్కడికి వచ్చారు. అతన్ని అగ్గిపెట్టె ఉందా అని అడిగి, దాడి చేశారు. రూ.5 వేలు, సెల్‌ఫోన్ లాక్కొని, ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించి, పరారయ్యారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి, నిందితుల కోసం గాలించగా సోమవారం మేడిపల్లి క్రాసింగ్ వద్ద బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. సీఐ నిరంజన్‌రెడ్డి వారిని పట్టుకున్నారు. విచారణలో మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లికి చెందిన ఏనుగు వంశీ, మెట్‌పల్లి మఠంవాడకు చెందని బైండ్ల వేణు, బండలింగాపూర్‌కు చెందిన కైర వెంకటేశ్ అలియాస్ రవిగౌడ్‌లని తేలిందన్నారు. వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, ఫోన్‌తోపాటు రూ.5 వేలు ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి బైక్‌లో 200 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయితోపాటు 4 ఫోన్లు, రూ.5 వేలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు గంగారాం, చైతన్యలను డీఎస్పీ అభినందించారు.

'మాఫీ' ఏది.. రైతు భరోసా ఎప్పుడిస్తరు?

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణను నిలదీసిన రైతులు
- శంకరపట్నంలో ఘటన


ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను నిలదీస్తున్న రైతులు

శంకరపట్నం(మానకొండూర్): రూ.2 లక్షల పంట రుణమాఫీ ఏది.. మాకు ఇంకా కాలేదు.. రైతు భరోసా ఎప్పుడిస్తరంటూ.. రైతులు ఎమ్మెల్యేను నిలదీసిన ఘటన శంకరపట్నంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో జరిగే కార్యక్రమానికి వెళ్తుండగా కన్నాపూర్ రైతులు ఆయనను చుట్టుముట్టారు. మొలంగూర్‌ఏ ఇండియన్ బ్యాంక్‌లో తీసుకున్న సుమారు 900 మంది రైతుల పంట రుణాలు మాఫీ కాలేదన్నారు. వ్యవసాయ అధికారులకు ధ్రువపత్రాలు ఇచ్చినా లాభం లేకపోయిందని, ఇలా ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నరు? మిమ్మల్ని చేయమని రైతులు అడిగిండ్రా? హామీ ఇచ్చి, ఎందుకు చేయడం లేదు.. రైతు భరోసా ఎప్పుడిస్తరని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ ఐదేళ్ల చేసినా పూర్తి చేయలేదని, అధికారంలోకి వచ్చి 6 నెలలు కాకున్నా బద్నాం చేస్తున్నారంటూ రైతులతో కాంగ్రెస్ నాయకులు వాదనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీయడంతో రూ.2 లక్షల పైన ఉన్న వారికి మాఫీ కాలేదని, పైన ఉన్న డబ్బులు చెల్లిస్తే అయ్యేదని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులై, రూ.2 లక్షల రుణమాఫీ కాని వారందరికీ తప్పకుండా చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినా రైతులు శాంతించలేదు. దీంతో ఆయన రైతువేదిక వద్దకు వెళ్లిపోయారు.

నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ అనే యువకుడు నిప్పంటించుకొని, ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి బంధువుల వివరాల ప్రకారం.. శివప్రసాద్, అతని భార్య మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో అతను మనస్తాపానికి గురై, సోమవారం ఉదయం ఒంటిపై పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలైన అతన్ని కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

మందు కొట్టిన గడ్డి తిని..

- 60 జీవాలకు అస్వస్థత
- రెండు మేకలు మృతి


జీవాలకు వైద్యం అందిస్తున్న డాక్టర్ రవీందర్

గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన సందవేని చిన్న వెంకన్న అనే రైతుకు చెందిన 40 జీవాలు అస్వస్థతకు గురైనట్లు వైద్యాధికారి రవీందర్ తెలిపారు. గడ్డి మందు కొట్టిన గడ్డిని మేయడం వల్లే ఇలా జరిగిందన్నారు. అలాగే, తిర్మలాపూర్ పీడీ గ్రామానికి చెందిన బిరుదుల గంగాధర్ అనే రైతుకు చెందిన మేకలు గడ్డి మందు కొట్టిన గడ్డి మేశాయని తెలిపారు. 2 మేకలు చనిపోగా 20 జీవాలు అస్వస్థతకు గురయ్యాయన్నారు. సోమవారం వీటన్నింటికీ వైద్యం అందించినట్లు పేర్కొన్నారు.

క్యూలైన్‌లో కుప్పకూలిన భక్తుడు

- వేములవాడ ఆలయంలో ఘటన


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ సిబ్బంది

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం వరంగల్ నుంచి కుటుంబసభ్యులతో వచ్చిన ఓ భక్తుడికి క్యూలైన్‌లో ఉండగానే ఫిట్స్ వచ్చింది. దీంతో అతను అక్కడే కుప్పకూలాడు. ఆలయ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడికి ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు.

వివాహితపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ వివాహితపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో ఓ వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. ఉపాధ్యాయుడు తరచూ అతని భార్యకు ఫోన్ చేస్తూ, మెస్సేజ్‌లు పెడుతున్నాడు. ఆమెను లైంగికంగా వేధిస్తున్నాడు. భరించలేక బాధితురాలు ఆదివారం రాత్రి 100కు కాల్ చేసింది. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు ఆ ఇంటికి చేరుకొని, సదరు వివాహిత వద్ద వివరాలు సేకరించారు. దీనిపై టౌన్ సీఐ రవిని వివరణ కోరగా బాధితురాలు 100కు కాల్ చేసింది వాస్తవమేనన్నారు. ఫిర్యాదు ఇవ్వమంటే కొంత సమయం తీసుకుంటామని ఆమె భర్త తెలిపినట్లు పేర్కొన్నారు. అయితే, రాత్రే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిసింది. కానీ, స్థానిక కొంతమంది పెద్ద మనుషులు రంగప్రవేశం చేసి, ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చినట్లు సమాచారం.

తల్లిదండ్రులతో గొడవపడి.. పెట్రోల్ తాగి

- తండ్రికి ఫోన్ చేసిన కుమారుడు
- తర్వాత అపస్మారక స్థితిలోకి..
- సెల్‌ఫోన్ లొకేషన్ ద్వారా గుర్తించి, ఆస్పత్రికి తరలింపు


చికిత్స పొందుతున్న నరేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): తల్లిదండ్రులతో గొడవపడ్డాడు.. క్షణికావేశంలో పెట్రోల్ తాగాడు ఓ యువకుడు.. కడుపులో మంట భరించలేక తండ్రికి ఫోన్ చేయడంతో కానిస్టేబుల్ సహాయంతో ఆస్పత్రికి తరలించాడు. వివరాల్లోకి వెళ్తే.. ముస్తాబాద్ మండలంలోని మద్దికుంటకు చెందిన పల్లపు నరేశ్ సోమవారం ఇంట్లో అమ్మానాన్నతో గొడవ పడ్డాడు. అలిగి, బయటకు వెళ్లిపోయాడు. ముస్తాబాద్, నామాపూర్ గ్రామాల మధ్య చెట్ల పొదల్లో పెట్రోల్ తాగాడు. కడుపులో మంట భరించలేక తండ్రి నర్సింలుకు ఫోన్ చేశాడు. తనను కాపాడాలంటూ అపస్మాకర స్థితిలోకి వెళ్లాడు. నర్సింలు చుట్టుపక్కల గాలించినా నరేశ్ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, విషయం చెప్పాడు. ఎస్సై గణేశ్ ఆదేశాలతో ఐటీ కానిస్టేబుల్ రాజశేఖర్ వెంటనే నరేశ్ సెల్‌ఫోన్ లొకేషన్ తెలుసుకున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో చెట్ల మధ్య ఉన్న నరేశ్‌ను గుర్తించి, హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు తెలిపారు. యువత తల్లిదండ్రులతో గొడవ పడి, క్షణికావేశంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్సై సూచించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం ఇస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కరీంనగర్: జిల్లాలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.తిరుపతి, కె.బాపూరావు కోరారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో గత కొన్నేళ్లుగా వివిధ పత్రికలు, చానళ్లలో రిపోర్టర్లుగా ఉన్నవారు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో చాలా మందివి పేద కుటుంబాలేనని, సొంత ఇల్లు లేక అద్దెకు ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని, నివేశన స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు జిల్లాలో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి, వెంటనే నివేశన స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రాజు, చెట్ల శంకర్, రమణ, లావణ్య, దొడ్డ రాజేంద్రప్రసాద్, ఖాజాఖాన్, లక్కం సురేశ్, రమేశ్, విజయ్‌కుమార్, సుదర్శన్ రెడ్డి, రవీందర్, నీల రాజు, కొమ్ము గణేశ్, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాద కారకుడికి 19 నెలల జైలు

వీణవంక(హుజూరాబాద్): అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి, ఓ బాలుడి మృతికి, పలువురు తీవ్రంగా గాయపడేందుకు కారణమైన వ్యక్తికి 19 నెలల జైలుశిక్ష, రూ.6,500 జరిమానా విధిస్తూ హుజూరాబాద్ మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. వీణవంక కోర్టు విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని బొంతుపల్లికి చెందిన జునూతుల మనోహర్‌రెడ్డి 2003లో అజాగ్రత్తగా, అతివేగంగా ట్రాక్టర్ నడపడంతో అది బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జునూతుల రాజేశ్వర్‌రెడ్డి (9) అక్కడికక్కడే మృతి చెందగా జునూతుల శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరమ్మ, చదువు శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి సోమవారం మనోహర్‌రెడ్డికి శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో నిబద్ధతతో పని చేసి, నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులును హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అభినందించారు.

తాళం వేసిన మూడిళ్లలో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావు

పెద్దపల్లిరూరల్: తాళం వేసిన మూడిళ్లలో ఆదివారం రాత్రి దొంగలు పడి, బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని లక్ష్మినగర్(చీకురాయిరోడ్)లో ఎర్రోజు వేణుగోపాల్ ఇంట్లోని 13 తులాల బంగారు, ఐదున్నర తులాల వెండి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వచ్చే నెలలో తన కూతురు పెళ్లి ఉందని, ఈ సమయంలో నగలు పోయాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. ఏసీపీ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావు బాధితుడి ఇంటికి చేరుకొని, పరిశీలించారు. క్లూస్ టీం సహకారంతో ఆధారాలు సేకరించారు. అలాగే, ఇదే కాలనీకి చెందిన లక్ష్మణ్‌రావు ఇంట్లో ఇటీవల అద్దెకు దిగినవారి గదిలోని రూ.2 వేలు, సెల్‌ఫోన్ చార్జర్లు పోయాయి. శివపురి కాలనీకి చెందిన మరో ఇంట్లో దొంగలు పడి, రూ.లక్ష, తులం బంగారం ఎత్తుకెళ్లారు. వరుస చోరీలతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాళాలు వేసి, ఊళ్లకు వెళ్లేవారు ఇంటి సమీపంలోని వారికి, పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

జాతీయ ట్రెక్కింగ్ పోటీలకు ఎంపిక


అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం.అనిల్ అక్టోబర్ 22న హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగిన ట్రెక్కింగ్ క్యాంప్ సెలక్షన్స్‌లో అతను ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా సోమవారం అనిల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్, బీకాం డిపార్ట్‌మెంట్ హెడ్ టి.రాజయ్య, వైస్ ప్రిన్సిపాల్ పి.నితిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అర్జున్, రాజేశం, ఎలిజబెత్ రాణి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


మక్కయ్య మృతదేహం

కోరుట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని ఏస్కొనిగుట్టకు చెందిన పెంట మక్కయ్య (47) సోమవారం ఉదయం బైక్‌పై కోరుట్ల వైపు వస్తున్నాడు. పట్టణ శివారులోని గార్డెన్స్ వద్ద ఆగివున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరు..


ఆంజనేయులు (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కారు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధి ప్రియదర్శిని కాలనీకి చెందిన జేరిపోతుల ఆంజనేయులు(45) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అతనికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆంజనేయులు ఆదివారం రాత్రి 7 గంటలకు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. దుర్శేడ్ శివారులో అతివేగంగా వస్తున్న కారు వెనక నుంచి అతన్ని బలంగా ఢీ కొట్టింది. అదే సమయంలో కరీంనగర్ నుంచి నల్ల గుంటపల్లెకు బైక్‌పై వెళ్తున్న దుబ్బాసి వినోద్, వడ్లూరి కిరణ్ ఈ ప్రమాదాన్ని గుర్తించి, ఆంజనేయులు భార్యకు ఫోన్ చేసి, చెప్పారు. అనంతరం బైక్‌పై కారును వెంబడించినా ఫలితం లేకపోయింది. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతివేగంగా కారు నడిపి, తన భర్త మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మృతుడి నేత్రాల సేకరణ..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆంజనేయులు కోరిక మేరకు అతడి నేత్రాలను సోమవారం కుటుంబసభ్యుల సమక్షంలో ఎల్వీ ప్రసాద్ వైద్యశాల సిబ్బంది సేకరించారు. కుటుంబసభ్యులు జేరిపోతుల యశ్వంత్, సాయిచరణ్, సుమన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోల అన్నారెడ్డి, చింతల కిషన్, గాజుల సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

రైతు మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

- పంటల రక్షణకు విద్యుత్ సరఫరా చేయొద్దు
- మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): పంట రక్షణకు ఏర్పాటు చేసిన కంచెకు విద్యుత్ సరఫరా చేసి, ఓ రైతు మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సోమవారం మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌కు చెందిన గొండ సాయన్న తన వ్యవసాయ భూమిలో మొక్కజొన్న సాగు చేశాడు. ఆ పంటను అటవీ జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు చుట్టూ ఇనుప కంచె అమర్చి, అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాడు. ఈ మొక్కజొన్న పంట పక్కనే జెల్ల పెద్ద ముత్తన్న(60) వరి సాగు చేస్తున్నాడు. ఈ నెల 18న పంటకు ఎరువు చల్లుతూ ప్రమాదవశాత్తు ఇనుప కంచెకు తగిలాడు. దీంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఇనుప కంచెకు కరెంట్ వస్తుందన్న సమాచారం ఇవ్వకుండా సాయన్న తన భర్త మృతికి కారణమయ్యాడని మృతుడి భార్య పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కిరణ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డిలతో కలిసి సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టారు. అప్పటికే నిందితుడు సాయన్న పరారయ్యాడు. సోమవారం కుస్తాపూర్‌కు వచ్చాడన్న సమాచారంతో పోలీసులు వెళ్లి, అతన్ని అరెస్టు చేశారు. రైతులు పంటల రక్షణ కోసమని అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ కలీం, కానిస్టేబుళ్లు భూమయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి


పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రామగుండం వాసులు

పెద్దపల్లిరూరల్: రామగుండంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను తమకు కేటాయించాలని ఎంపికైన లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. మొత్తం 660 ఇళ్ల కోసం ఇప్పటికే ఎంపిక చేసినవారికి వీలైనంత త్వరగా ఇళ్లను కేటాయించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసేలా చొరవ చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు విన్నవించారు. గతంలోనూ పలుమార్లు మొరపెట్టుకున్నామని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన ఎంపికైనవారికి నెల రోజుల్లోగా ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు ఐదారు మాసాల సమయం పట్టే అవకాశముందని పేర్కొన్నారు.